# 4. శ్రమఫలం

"అన్నాయ్ ఊరికిపోవాలంట నానా... నిన్ను అడిగి 50 రూపాయలు డబ్బులు ఇప్పిచ్చుక రమ్మన్నాడు!" పశువుల కొష్టం దగ్గర కూర్చుని తాడు వేసుకుంటున్న రమణయ్య దగ్గరకు చిన్నకొడుకు నరహరి వచ్చి అడిగాడు.

"నేను ఇంటికి వస్తన్నాలే... నువ్వు పదరా!" అన్నాడు రమణయ్య.

"ఎప్పుడు నానా వచ్చేదీ? అన్నాయ్ పొద్దున్నే అడిగాడంటగా నిన్నూ! తొందరగా ఇప్పిచ్చుక రమ్మన్నాడు. మళ్ళీ బస్సు పోయిద్దంట!"

"బస్సు పోదూ, ఏం పోదూ కానీ... నువ్వు అరవకుండా పదరా ఇంటికి... వస్తానంటంలా! ఈ బస్సుపోతే యెనక ఇంకో బస్సు కూడా ఉందిలే. బస్సులకేం కొదవ!" అన్నాడు రమణయ్య అసహనంగా, కాస్తంత చిరాకుగా.

"ఇస్తానన్న డబ్బులు ఇస్తే, ఆయన దారిన ఆయన ఊరికి పోతాడు కదా! ఇప్పటికే ఎండబడిపోయా! ఆయన ఏమో ఇప్పిచ్చుకుని రమ్మని నన్ను పంపుతుండే! నువ్వేమో ఇయ్యకపోతంటివీ, ఇంటికి రాక పోతంటివీ! మజ్జెలో నన్ను చంపుతున్నారు ఇద్దరూ కలిసి!" పధ్నాలుగేళ్ళ నరహరి పెద్ద ఆరిందిలా అని తుర్రుమన్నాడు.

రమణయ్య వేస్తున్న తాడు పురిని కొష్టం చూరులో పెట్టి, మంచం మీద కండువా విదిలించి భుజం మీద వేసుకుని కదిలాడు.

రమణయ్య పెద్ద కొడుకు వెంకటేశ్వర్లు. పదవ తరగతి పాసయ్యాడు. పదిలో మంచి మార్కులే వచ్చాయి.

పది తరువాత పొరుగు ఊళ్ళో కొత్తగా పెట్టిన జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చేరాడు.

కొత్త కాలేజీ. సరైన అధ్యాపకులు లేరు. క్లాసులు జరిగేవి కాదు. చివరికి పరీక్షల్లో ఆ కాలేజీకి ఉత్తీర్ణతా శాతం పదకొండు వచ్చింది. ఆ పదకొండు శాతంలో వెంకటేశ్వర్లు లేడు.

చదువు ఉద్యోగం కోసమే! ఆ ఉద్యోగం అంటే ఒకరి కింద, ఒకరి ఆధీనంలో పని చేయటమే కదా!

తమకి పదెకరాలు నిక్షేపం లాంటి పొలం ఉంది.

వ్యవసాయం అయితే ఒకరికి సలాం కొట్టకుండా చక్కగా, స్వతంత్రంగా జీవించవచ్చు అని కూడా అనుకున్నాడు వెంకటేశ్వర్లు.

ఈ ఆలోచన గట్టిగా ఉండటంతో కాలేజీలో చేరాడనే మాటే కానీ, చదువు మీద శ్రద్ధ చూపెట్టలేదు.

ఇలా చాలా కారణాలు కలవడంతో ఇంటర్మీడియట్ ఫెయిల్ అయ్యాడు.

ఇంటి దగ్గరే, వ్యవసాయంలో తండ్రికి చేదోడువాదోడుగా ఉండటం మొదలు పెట్టాడు.

రమణయ్య మంచి కష్టజీవి. ఇద్దరు మనుషుల చాకిరీ ఒక్కడే ఒంటి చేత్తో చేయగల పనివాడు. భార్య జయమ్మ కూడా చక్కగా పనిచేసే మనిషే!

భార్యాభర్తలూ, పెద్దకొడుకూ ముగ్గురూ కలసి రేయింబవళ్ళూ పొలంలో పనిచేసే వాళ్ళు.

వీళ్ళు ఎంత కష్టపడీ, ఎంత శ్రమ చేసీ, ఎంత పంట పండిస్తున్నా చివరికి హాళ్ళికి హాళ్ళీ సున్నకి సున్నా అవుతోంది.

పొలంలో పంటని చూసి ఎంతో ఆశతో ఎన్నో కలలు కనే వాళ్ళు. చివరికి ఆ పంటని నూర్చుకునీ, అమ్ముకునీ, చేతిలో డబ్బులు వచ్చిన తరువాత తెచ్చిన పెట్టుబడీ, మందుల కొట్లలో బాకీలు చెల్లుపోగా కన్న కలలు అన్నీ కల్లలైపోయేవి.

పంట మీద వేసుకున్న అంచనాలు అన్నీ తలకిందులై పోయేవి.

ఎంతో ఉత్సాహంతోనూ, దీక్షతోనూ, ఆశతోనూ, ఆనందంతోనూ చదువుకి మంగళం పాడి, పొలం పనిలో పడిన వెంకటేశ్వర్లుకి కొద్ది కాలంలోనే భ్రమలు అన్నీ చెదిరిపోయాయి.

వ్యవసాయం అంటే అనుకున్నంత తేలిక కాదు అనే విషయం తెలిసి వచ్చింది.

ప్రకృతి నించి సవాళ్ళని ఎదుర్కోవడంతో పాటు, ఎప్పుడెప్పుడు దొరుకుతాడా, ఎప్పుడెప్పుడు కాటు వేద్దామా అని సిద్ధంగా కాచుకుని ఉండే వ్యాపార విషసర్పాల నించి కూడా రైతుకి తీవ్ర ముప్పు ఏర్పడుతోందని తెలుసుకున్నాడు.

పది ఎకరాలు పొలం ఉన్న రైతుకంటే, పది వందల రూపాయల ఉద్యోగస్తుడు మేలు అనే విషయం బాగా అర్థమైపోయింది.

ఆర్టీసీలో కండక్టర్ ఉద్యోగానికి ఖాళీలు పడ్డాయి.

అప్లికేషన్ ఫారం తెప్పించి, ఆ ఉద్యోగానికి అప్లయ్ చేయాలని తండ్రిని 50 రూపాయలు అడిగాడు.

రమణయ్య దగ్గర కానీ, జయమ్మ దగ్గర కానీ, ఇంట్లో కానీ రూపాయి లేదు.

బర్రెపాడి లేదు. బర్రె పాలు ఇవ్వడం ఆపేసి రెండు నెలలు అయింది. ఉంటానికి రెండు బరిగొడ్లు ఉన్నా, రెండూ చూడి మీద ఉన్నాయి. పాడి ఉంటే ఇంట్లో పదో, పాతికో డబ్బులు కనబడుతూ ఉండేవి.

కొష్టం దగ్గర్నించి బజారుకి వచ్చిన రమణయ్య చేబదులు ఎవర్ని అడగాలా అని ఆలోచించాడు. తనకి బాగా మొహమాటం. పైగా ఎవరూ చేబదుళ్ళు ఇచ్చే స్థితిలో లేరు.

చుట్టుపక్కల ఇళ్ళ వాళ్ళందరూ వ్యవసాయంలో దండగలు పడి దెబ్బతిని ఉన్నారు. వాళ్ళే తనని అడుగుతుంటారు.

శేషయ్య శెట్టిని అడుగుదామని వాళ్ళ కొట్టుకి వెళ్ళాడు రమణయ్య.

"ఏం శేషయ్యా, ఏం చేస్తన్నా?" అని పలకరించాడు.

"ఏముంది చేయటానికి? ఊళ్ళో రైతులు అందరికీ అప్పులు ఇచ్చి కూర్చుంటినీ! అప్పుకి వచ్చి సరుకు తీసుకుపోతున్నప్పుడున్న నవ్వు డబ్బులు ఇచ్చేటప్పుడు ఉంటంలా! ఎవుర్నన్నా అడుగు రేపిస్తాం, మాపిస్తాం, పంట అమ్మలేదు అని చెప్పేవాళ్ళే తప్ప ఒక్కరు జమ ఇచ్చిన పాపాన పోలా!"

"పంటలకి ధరలు లేకపోయా! ఎవురూ పండిన పంట అమ్ముకోక పోతిరీ! అమ్మితే రైతులు నీ బాకీ ఇయ్యకుండా ఉంచుకుంటారా?"

"ఎప్పుడో పంటలు అమ్మిన తరువాత ఇస్తామంటే ఎట్టకుదిరిద్దీ? మమ్మల్ని పైన ఊరుకుంటారూ? అసలు మేం మాత్రం ఎంతమందికని అప్పిస్తాం, నువ్వే చెప్పు?"

"సర్లే"

"నువ్వు కూడా ఏం పంటలు అమ్మినట్లు లేదుగా?"

"ఏం అమ్మాను? ఏం అమ్మలా! సెనగలూ, మినుములూ, కందులూ అట్నే ఇంట్లో పడి మూలుగుతున్నాయి! అమ్ముదామంటే ఒక్క దానికీ ధర లేకపోయా! సర్లే కానీ యాభై రూపాయలు ఉంటే చేబదులు ఇయ్యి శేషయ్యా! పిల్లోడు ఊరికి పోవాలంటన్నాడు! రేపు మాపట్లో తెచ్చిస్తాలే, ఒక్కయాభై చాలు!"

"యాభై చాల్తయ్యా? మా దగ్గిర డబ్బులు ఎక్కడ ఉన్నయ్యయ్యా స్వామీ! ఇయ్యాల నేను సరుకులికి పోవాలి! సరుకులు తెచ్చుకోడానికి మాకే కొరవపడేటట్టుగా ఉంది. అంతగా అయితే ఇంటోకి నీక్కావలసిన సరుకు తీసకపో, అంతేగానీ డబ్బు మమ్మల్నెక్కడ చూడమంటా?" కసురుకున్నట్లే, విసుగ్గా అన్నాడు శేషయ్య.

"సరుకులు అప్పు ఇస్తన్నది చాలక డబ్బులు కూడా అప్పు ఇస్తా కూచుంటే ఇంక మేం బేరాలు చేసుకున్నట్టే, బాగుపడ్డట్టే!" వాకిట్లో నిలబడి ఉన్న శేషయ్య భార్య అన్నది.

రమణయ్యకి తల తీసేసినట్లయింది.

"ఛ... వీడ్ని అడిగి అనవసరంగా మాట పోగొట్టుకున్నానే!" అని రమణయ్య మనసులో మథనపడిపోతూ బజారు దారి పట్టాడు.

ఆ ఊరికి వట్టి చేతులతో, కట్టుగుడ్డలతో వచ్చిన వాడు శేషయ్య. అలాంటి వాడు రెండు లక్షలు పెట్టి డాబా కొనుక్కున్నాడు. మూడు ఎకరాలు పొలం కొన్నాడు. ఇంకా చాలా డబ్బు కూడా ఉందంటున్నారు.

అతనికీ, తమకీ ఎంత వ్యత్యాసం ఉంది.

రేయింబవళ్ళూ చాకిరీ చేస్తున్నా తమ స్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడేలా ఉంది. అతనిని గురించి ఆలోచిస్తూ, తమ పరిస్థితికి తానే జాలిపడ్డాడు.

ధర ఉండనీయీ, లేకపోనీయీ... ఇవ్వాళ, రేపట్లో కందులో, మినుములో ఏదో ఒకటి అమ్ముకోవాల్సిందే అని కూడా అనుకున్నాడు.

దారిలో ఉన్న రామాలయం అరుగు మీద చాలా మంది రైతులు కూర్చుని మాట్లాడుకుంటున్నారు. రమణయ్యకి ఇంటికి వెళ్ళాలనిపించలేదు.

ఇంటికి వెళ్తే కొడుకు డబ్బులు అని గుక్క తిప్పుకోనివ్వడు. ఆ అరుగు మీద తనూ చతికిలపడి తోటి రైతులతో మాటల్లో పడ్డాడు.

చాలా సేపు మాట్లాడి, తప్పదు కాబట్టి, ఇంటికి నెమ్మదిగా వెళ్ళాడు.

* * *

"వెంకటేశులు యాభై రూపాయలు అడిగితే తెచ్చిస్తాననన్నోడివా నువ్వు! నిన్ను నమ్ముకుంటే బాగానే చేస్తావు! వాడు నీ కోసం చూసీ చూసీ, సావాసగాళ్ళలో ఎవురి దగ్గర్నో చేబదులు తీసుకుని వెళ్ళాడు."

"చేబదులు ఎవుర్ని అడిగినా ఇయ్యలేదే నాకు!"

"ఒకరు ఇచ్చేదేందయ్యా? ఒకర్ని దేబిరించాల్సిన కర్మ మనకేం పట్టింది? ఇంటో వేల రూపాయల పంట ఉంది. వెనుకా ముందాలోచించకుండా అమ్మిపారేద్దాం!"

"నాకూ గట్టిగా అమ్ముదామనే ఉంది. అయితే ధరల్లేవు కదా!"

"ఏందీ ధరలు ఉండేదీ? ఇంతకంటే ఎక్కువ ధరలు వస్తయ్యేంది? ధర పెరిగితే తినే వాళ్ళమే కానీ, ఒకాళ తగ్గితే అప్పుడు లబోదిబోమని మొత్తుకోవాల్సి వచ్చిద్ది!"

"మరీ నీలకుక్కాలికి అడుగుతున్నారే! నిరుడు 20 వందలు అమ్మిన కందులు ఇప్పుడు పదకొండొందలు అంటంట్రి! అట్నే నిరుడు ఇరవై రొండొందలు అమ్మిన మినుములు ఇప్పుడు పన్నెండొందలేనాయె! అన్నిటికీ మరీ అడ్డగోలుగా ధరలు దించే స్తిరీ!"

"ఏం చేద్దామంటా?"

"ఏం చేయాలో నాకూ తోచటంలా! ఈ ధరలకి అమ్ముకుంటే మనకి చాలా దండగ వచ్చిద్ది! వచ్చే డబ్బులు మనం వేసే పురుగు మందులకి రావు!"

"అయినా మనం చేయగలిగిందేం ఉంది?"

"మన పంటలు తీసకపోయి వేర్ హౌస్‌లో దాచి పెట్టుకుంటే, బ్యాంకు వాళ్ళులోను ఇస్తారంటగా?"

"అది జరిగే పనేనా? ఆ పాట్లు మనం ఏం పడతాం? మనకి పండినయ్యి పదిరవై బస్తాల చింద! ఈ కాసిని గోతాల్నీ గోడవునుకి ఏం తోల్తాం? ఇంటోనా డబ్బుల్లేవు. తెచ్చుకున్న బాకీలకి వడ్డీలు పడతన్నయ్! ఏందీ లాభం? మనకేం వద్దు కానీ సరుకుని తొందరగా అమ్మి పారేద్దాం!" అంది జయమ్మ.

"సరే అయితే... ఇప్పుడు మినుములు మట్టుకి అమ్ముకుందాం!" అని రమణయ్య ఎరువుల కొట్టు సుబ్బరామయ్య దగ్గరకి వెళ్ళాడు.

* * *

సుబ్బరామయ్య రైతులకి అవసరమయ్యే అన్ని రకాల వ్యాపారాలూ చేస్తాడు.

ముందుగా విత్తనాలు తీసుకొచ్చి అమ్ముతాడు. తరువాత ఎరువులూ, చీడపురుగు మందులూ అమ్ముతాడు. చివరికి రైతుకి పండిన పంటని కూడా తనే కొనుగోలు చేసి లాభానికి అమ్ముకుంటాడు.

"అపరాల సెక్షన్‌కి ఇప్పుడు వచ్చినంత మందం ఇంతకు ముందెప్పుడూ రాలేదనుకోరా! ఎంతో కొంతకి అమ్ముకుందామన్నా, అసలు కొనేవోడు ఎవుడూ లేడుగా! బర్మానించి రెండు షిప్పుల అపరాలు మద్రాసు రేవుకి రాబట్టే రేట్లు ఇట్ట పడిపోయినయ్యి! లేకపోతే ఇయ్యేడు ధరలు బాగా ఉండాల్సిన మాట!" అని సుబ్బరామయ్య ఎదురుగా కూర్చున్న ఇద్దరు రైతులతో కోతలు కోస్తున్నాడు, రమణయ్య వెళ్ళేటప్పటికి.

"మినుములు అమ్ముదామనుకుంటున్నానోయ్, రేటెంతుందీ?"

"ఇప్పుడు పన్నెండొందల కంటే రేటు ఎక్కువ లేదు రమణయ్యా! నెల రోజుల సైటుకి అయితే పన్నెండొందల అరవై. అవీ కొనేవాడు ఎవడూ లేడు! మనమే కొనుక్కుని వేర్‌హౌస్‌కి తోలుకోవటమే!"

"ముఠావాళ్ళని పంపించోయ్! రెండు జల్లెళ్ళూ పట్టుకుని కాటాలు యేసుకుంటారు! రొక్కం బేరానికేలే!"

"డబ్బుల తోటి ఏం అవసరం వచ్చింది? సైటుకి వేయకపోయా!"

"కాదులే... అప్పుకి ఇచ్చి మీ చుట్టూ ఎక్కడ తిరిగేది? నెల రోజుల సైటుకి అంటే మీరు రెండు నెల్లుకి డబ్బులు ఇచ్చేది? అదీ మీ చుట్టూ మేం బిచ్చగాళ్ల మాదిరిగా తిరగాలి? ఎందుకొచ్చిన రంధి. రొక్కానికే అమ్ముకుంటే పోయా!"

"సరే, మజ్జెన్నం వస్తార్లే ముఠావాళ్ళు, కాటాలు యేద్దాం!"

* * *

ఆ రోజు సాయంత్రం ముఠావాళ్ళు వచ్చి, రెండు జల్లెడలూ పట్టుకుని, కాటాలు వేసుకున్నారు.

ఇంటి అవసరాలకి ఉంచుకోగా, పది క్వింటాళ్ళు కాటాలకి అయ్యాయి.

పన్నెండు వేలు వచ్చాయి.

మినప పైరు వేసిన పొలం రెండు ఎకరాల కంటే కొంచెం ఎక్కువే ఉంటుంది.

సేద్యం, విత్తనాలూ, కలుపూ, ఎరువులూ, పురుగు మందులూ, పంట పీకుడూ, నూర్పిడీ, ట్రాక్టరు బాడుగా అన్నీ లెక్క చూసుకుంటే ఎకరానికి దాదాపుగా ఐదున్నర వేయి అయింది. అంటే రెండు ఎకరాలకీ కలిపి పదకొండు వేలు ఖర్చయింది.

తాము చేసిన చాకిరీని లెక్కలోనికి తీసుకోలేదు. పెట్టిన ఖర్చుకీ, వచ్చిన రాబడికీ చెల్లుకి చెల్లు! లేదా వెయ్యా, పన్నెండు వందలు మిగిలిఉంటాయి.

కొంత మంది రైతులకి అయితే అదీలేదు. వాళ్ళకి ఎకరానికి రెండు మూడు క్వింటాళ్ళే పండాయి. అంటే వాళ్ళు దాదాపు నాలుగు వేలు దండగలు పడ్డారన్నమాట!

"ఇంకా రెండు మూడు నెల్లు ఉంటే ధరలు బాగా పెరిగేయేనే! కొట్లోళ్ళు అందరూ ఒక్కోరు తొమ్మిదీ పది లారీలు కొని స్టాకు చేసి పెట్టుకుంటున్నారంటే ఎందుకూ? ముందు ముందూ ధరలు బాగా వస్తయ్, లాభపడదామనేగా!" అని రమణయ్య బాధపడ్డాడు జయమ్మతో చెప్పి.

"మనకి ఎంత ప్రాప్తమో అంతే వస్తయ్! ముందు ముందు ధరలు ఇంకా తగ్గుతయ్యేమో ఎవురు చూడొచ్చారు? కందులు ఉంచుకున్నాంగా, అవి మంచి ధరకి అమ్ముకోవచ్చులే!" అని జయమ్మ ఊరడింపు మాటలు అంది.

ఇరవై రోజులు గడిచిన తరువాత కందులు కూడా అమ్ముకోక తప్పలేదు. మొదట్లో పదమూడు వందలకి కొనుగోలు చేసిన కందులు క్రమంగా తగ్గిపోతూ చివరికి పదకొండు వందలకే కొనడం మొదలు పెట్టారు. రేటు ఇంకా తగ్గుతుందనే భయంతో రమణయ్యా, జయమ్మా కందులు కూడా అమ్మేసుకున్నారు.

పదకొండు వందల ధర మీద ఇరవై క్వింటాళ్ళు అమ్మారు.

సుబ్బరామయ్యా, మరో ఇద్దరు వ్యాపారులూ ఊళ్ళో రైతుల వద్ద ఉన్న మినుములూ, కందులూ మొత్తం కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన మినుములూ, కందులూ రైతుల పేరుతోనే వేర్‌హౌజ్‌కి లారీల మీద తోలారు.

వేర్‌హౌజ్ వాళ్ళు, వాళ్ళ గోడవున్‌లో ఉన్న స్టాక్‌కి బాండ్ కాగితం ఇస్తారు. ఆ బాండ్ తీసుకుపోయి ఏ బ్యాంక్‌లో పెట్టుకున్నా బ్యాంక్ వాళ్ళు లోన్ ఇస్తారు.

సుబ్బరామయ్యా, ఇతర వ్యాపారులూ ఒక లారీ మినుములో, కందులో రైతుల వద్ద కొనుగోలు చేస్తారు. అవి వేర్‌హౌజ్‌కి తోల్తారు. వాళ్ళు బాండ్ ఇస్తారు. ఆ బాండ్ తీసుకుపోయి బ్యాంక్‌లో అప్పు తెస్తారు. ఆ డబ్బుతో రైతుల వద్ద మళ్ళీ కొనుగోలు చేస్తారు.

ఆ విధంగా సుబ్బరామయ్య ఆరు లారీల మినుములూ, ఎనిమిది లారీల కందులూ వేర్‌హౌజ్‌కి తోలాడు.

డబ్బు బ్యాంక్ వాళ్ళది. పంట రైతులది.

రెండు మూడు నెలలు గడిచాయో లేదో మినుములకి పందొమ్మిది వందల రూపాయల ధర వచ్చింది. కందులు పదిహేడు వందల రూపాయలకి వచ్చాయి.

తను అనుకున్న ధర రావడంతో సుబ్బరామయ్య కొనుగోలు చేసిన పంట మొత్తం అమ్ముకున్నాడు.

"చూస్తా చూస్తా ఐదు పైసలు ఖర్చుపెట్టడానికి అల్లాడిపోతాం! ధరలో చూడు ఎంత పోగొట్టుకున్నామో! మినుముల్లో ఏడు వేలు పోయా, కందుల్లో పన్నెండు వేలు పోయా! మనకి వచ్చిద్దనుకున్న ఆదాయం అంతా ధరలోనే పోగొట్టుకుంటిమి" అని రమణయ్యా, జయమ్మా ఎంతో బాధపడ్డారు.

ఆ ఊళ్ళో రైతులు అందరికీ మినుప పంటా, కంది పంటా మీద ఎంత ఆదాయం వచ్చిందో, సుబ్బరామయ్యా, ఇతర వ్యాపారులకి వాటి మీద అంతకంటే ఎక్కువ ఆదాయం వచ్చింది.

తాము చేసిన శ్రమకీ, కష్టానికీ, చిందించిన స్వేదానికీ, పెట్టిన పెట్టుబడికీ తమకి దక్కిన ఫలం కంటే, ఇంటి దగ్గరే కూర్చుని చెమట చుక్క చిందించకుండా సుబ్బరామయ్య, ఇతర వ్యాపారులూ సంపాదించిన ఆదాయమే ఆ రైతుల్ని విస్మయపరిచింది.

**ఈనాడు ఆదివారం – 21 సెప్టెంబర్ 1997**